

ఉష్ణోగ్రత
గరిష్ఠం 42.9
కనిష్ఠం 21.7



చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం 7

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

ప్రభుత్వం చెప్పిందొకటి చేసేదొకటి

» ప్రొఫెసర్ హరగోపాల్

యాచారం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి రాగానే ఫ్యూచర్‌సిటీ పేరుతో మళ్లీ భూసేకరణకు పూనుకోవడం దారుణమని తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. పర్యావరణవేత్తలు, తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ప్రతినిధులు ఫార్మాసిటీ బాధిత గ్రామమైన మేడిపల్లిలో పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పీపుల్స్ జేఏసీ జాయింట్ కన్వీనర్ రవి కన్నెగంటితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఫ్యూచర్‌సిటీకి మార్చడం చట్టవ్యతిరేకమని ఆరోపించారు. ఫ్యూచర్‌సిటీ ప్రతిపాదనను తక్షణమే విరమించుకొని భూసేకరణను ఆపాలన్నారు. 2013చట్టం తెస్తామని, ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికలముందు కాంగ్రెస్ నాయకులు రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. పచ్చటి పంటపొలాల్లో కాలుష్యకారకమైన ఫార్మాసిటీ ఏర్పాటుకు పాలకులు పూనుకోవడం మంచిదికాదన్నారు. ఒక పక్క రాజ్యాంగాన్ని రక్షిస్తామని చెబుతూనే అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. వారివెంట విశ్రాంత ప్రొఫెసర్ వనమాల, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక ప్రతినిధి మీరాసంఘ మిత్ర, మానవ హక్కుల వేదిక కన్వీనర్ నర్సింహ, కవుల సరస్వతి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తప్పులు సరిదిద్దడానికే భూ భారతి

» కలెక్టర్ నారాయణరెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దడానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంపై బుధవారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. భూభారతితో పెండింగులో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ చట్టం ద్వారా పేద రైతులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లో తహసీల్దార్ విచారణ జరిపి పట్టాదారు పాసుపుస్తకం ఇస్తారన్నారు. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, సూపరిండెంట్ అనీల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్వేత, ఆర్ఐలు నరసింహయాదవ్, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసనలు




షాద్‌నగర్ అర్బన్: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. పార్టీలకు అతీతంగా ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 23



కడ్తాల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు





ఆధార్‌లా..

భూధార్!

ప్రతీ కమతానికి 11 అంకెల ప్రత్యేక నంబర్

వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. దేశ పౌరులకు ఇచ్చిన ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకూ ప్రత్యేకంగా గుర్తింపు కార్డు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. రైతులందరికీ ఆధార్ కార్డు తరహాలో భూధార్ కార్డుల జారీకి ప్రయత్నాలు ప్రారంభించాయి. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నప్పటికీ ప్రతీ భూ కమతానికి 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్)ను కేటాయిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం ఈ ప్రక్రియను మొదలు పెట్టాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నంబర్‌తో రైతులకు వారి భూములపై భరోసా పెరగనుంది.

- హద్దులు, పక్కా కొలతలతో కార్డులు జారీ
- డిజిటలైజేషన్ దిశగా అడుగులు
- భూధార్‌తో రైతుల భూములకు భరోసా
- వ్యవసాయ అధికారులకు శిక్షణ పూర్తి
- ప్రస్తుతానికి కేంద్ర పథకాలకే వర్తింపు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు విశిష్ట సంఖ్యను ఇచ్చే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం సైతం ముందుకు తీసుకువెళ్లేందుకు తగిన చర్యలు మొదలు పెట్టింది. రైతులకు భూధార్ కార్డుల జారీ కోసం తొలుత వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించింది. ఇటీవల నగరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా వ్యవసాయ శాఖ డివిజన్లలో ఎంఏవో, ఏఈవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణా కార్యక్రమాల అనంతరం ఈ పథకాన్ని ఈ నెల 22వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు రావడంతో వాటి పరిష్కారంపై దృష్టిపెట్టారు. ఈ పక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయిలో మరింత కసరత్తు చేసి మరిన్ని

మిగతా 8వ పేజీలో...

డిజిటలైజేషన్ వైపు అడుగులు

భూధార్ కార్డుల జారీ తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని కేంద్రం భావిస్తోంది. దశల వారీగా ఈ పక్రియను పూర్తిచేసేందుకు నిర్ణయించింది. ఈ పక్రియ పూర్తి చేసి కమతాలకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తే వ్యవసాయ భూములకు సంబంధించిన భూవివాదాలకు చాలావరకు పరిష్కారం దొరుకుతుంది. భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండడంతో భూయాజమాన్య హక్కుల గుర్తింపు ఇక సులభతరమవుతుంది. ప్రతీ రైతుకు సంబంధించిన భూముల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. భూ యజమానులకు ఆయా సర్వే నంబర్లలో భూమి విస్తీర్ణంతోపాటు హద్దులు తదితర వివరాలను నమోదు చేసి భద్రపరుస్తారు. దీంతో రికార్డులన్నీ పారదర్శకంగా ఉండడంతో సులభంగా భూములకు సంబంధించిన అన్ని వివరాలను గుర్తించవచ్చు.

సమాచారం

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు


షాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భూభారతిపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ అన్వర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

తలకొండపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూరం శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారికి సుప్రభాత సేవతో మేలుకొలుపు పాడారు. అనంతరం ఆలయ అర్చకులు అఖండ దీపారాధన, మహాగణపతి పూజ, మంటపారాధన, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నిధుల్లేవు.. పనులు కావు

- కునారిల్లుతున్న పంచాయతీలు
- గ్రామీణులకు కొరవడిన వసతులు
- నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

7

ప్రతిపాదనలకే పరిమితమా?

కందుకూరులో బస్టాండ్ లేక అవస్థలు

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్.. రోడ్డు పైనే దుకాణాలు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు, పాలకులు

ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న కందుకూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని 18 ఏళ్లుగా పోరాడుతున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో బస్సు కోసం రోడ్డుపైనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాలకులు, ప్రభుత్వ అధికారులు ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నారు. పలు రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, స్థానిక వ్యాపారులు అధికారులు, నాయకులకు 100కు పైగా దరఖాస్తులు ఇచ్చారు. అయినా నేటికీ బస్టాండ్ ఏర్పాటుకు ముందడుగు పడలేదు. అంతేగాక డివిజన్ కేంద్రంలో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



బస్టాండ్ లేక జాతీయ రహదారి పక్కన బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

కందుకూరు ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరు మండలాలను కలిపి కందుకూరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. నిత్యం హైదరాబాద్ నుంచి శ్రీశైలం, ఆమనగల్లు, కడ్తాల తదితర ప్రాంతాలకు వాహనాలపై వెళ్తున్న ప్రయాణికులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రహదారిపై బస్‌స్టాండ్ ఏర్పాటు చేయాలని అధికారులు, నాయకులకు వినతిపత్రాలు ఇచ్చినప్పుడల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడం తప్ప సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డదిడ్డ పార్కింగ్‌తో ట్రాఫిక్

జాతీయ రహదారి నిబంధనలకు విరుద్ధంగా స్థానిక వ్యాపారులు వ్యవహరిస్తున్న తీరుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపార సముదాయల ఎదుట రోడ్ల పైనే పార్కింగ్ చేయడంతో

మిగతా 8వ పేజీలో...

ఎన్నోసార్లు నివేదించాం



స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. వారు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా జాతీయ రహదారి నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ రోడ్డుకిరువైపులా మరుగుదొడ్లు, బస్టాండ్ నిర్మించాలి. అతడి నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- కందడి శ్రీరామ్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు

ప్రభుత్వ కాలేజీలు!

ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణతా శాతం.. కళాశాలల్లో సౌకర్యాలున్నా రాని ఫలితాలు

విద్యార్థులను పట్టించుకోని అధ్యాపకులు!.. ప్రైవేటుకే మొగ్గు చూపుతున్న విద్యార్థులు



రంగారెడ్డి అర్బన్/షాద్‌నగర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈసారి కూడా ఉత్తీర్ణతా శాతం తగ్గింది. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పించినా మెరుగైన ఫలితాలు సాధించడంలో పూర్తిగా వెనుకబడుతున్నాయి. ప్రైవేటు కళాశాలతో

మిగతా 8వ పేజీలో...

గురుకులాలు బెస్ట్

ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్ సత్తాచాటాయి. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 97శాతం ఉత్తీర్ణత సాధించింది. మొగిలిగిద్ద కేజీబీవీ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 50 శాతం, యాచారం మోడల్ కళాశాల మొదటి 78 శాతం, రెండో సంవత్సరంలో 85, మంచాల కేజీబీవీ మొదటి సంవత్సరంలో 95 శాతం, రెండో సంవత్సరంలో 100 శాతం, అలాగే మంచాల మోడల్ కళాశాల మొదటి సంవత్సరం 80 శాతం, రెండో సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించాయి.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి

» డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

కేశంపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నివేదితతోపాటు సిబ్బందితో మాట్లాడారు. పిల్లలకు పూర్తిస్థాయిలో టీకాలు వేయాలని, డ్రాప్ అవుట్లు, లెఫ్ట్ అవుట్లను గుర్తించి వారికి కూడా టీకాలు వేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో చెత్తా, చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.















ఎర్రవల్లిలో ఘనంగా ఎల్లమ్మ జాతర




వికారాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లిలో నాగుల ఎల్లమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. కొత్తగా నిర్మించిన ఊర డమ్మ, ఈర్లమ్మ, నాగఎల్లమ్మ ఆలయాలకు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. కల్లు సాకతో పూజలు చేశారు. అనంతరం నాగఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆర్పీఏ మెంబర్ జాఫర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.









కుర్మిద్దలో పీఎస్ ఏర్పాటుకు సర్వం సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన పోలీస్ స్టేషన్

యాచారం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మిద్ధ గ్రామంలో నిర్మించిన నూతన భవనంలోకి వారం, పది రోజుల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ తరలించడానికి పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, పోలీస్‌స్టేషన్ మేడిపల్లిలో కొనసాగడంతో జనం పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అద్దె భవనంలో ఠాణా, అద్దె భవనంలో ఫార్మాసిటీ పీఎస్ అనే శీర్షికలతో ప్రచురితమైన వరుస కథనాలకు రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. మేడిపల్లిలో పోలీస్‌స్టేషన్ కొనసాగడంతో కందుకూరు మండలంలోని సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, ఉట్లపల్లి, సార్లరావులపల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, మంగలిగడ్డ తండా. పోతుబండ తండావాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న వైనంపై అధికారులు స్పందించారు. పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించే దాకా అన్ని గ్రామాలకు అనువుగా ఉన్న కుర్మిద్దకు ఠాణాను తరలించాలని రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర పోలీస్ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందుకుగాను కుర్మిద్దలో అద్దె భవనంలో వసతులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి, ఈ నేపథ్యంలో రెండు మండలాల ప్రజలకు అనువుగా ఉన్న గ్రామానికి పోలీస్ స్టేషన్‌ను తరలించడాన్ని స్వాగతిస్తూ అధికారుల చర్యలను అభినందిస్తున్నారు. వైరింగ్, పాల్‌సీలింగ్ పూర్తిచేసి పోలీస్‌స్టేషన్ తరలింపునకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

అధ్యాపకురాలు సౌజన్యకు డాక్టరేట్



ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ పరిధిలో ఉన్న అనురాగ్‌వర్సిటీ అధ్యాపకురాలు యెర్రమనేని సౌజన్యకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ అధ్యయన కోర్సును అభ్యసించి 'మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌తో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు' అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఐటీ డీన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు. ఈనెల 19న ఎన్ఐటీ-తిరుచిరాపల్లి ప్రొఫెసర్ ఆధ్వర్యంలో జరిగిన వైవా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ చూపిన సౌజన్యకు బుధవారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ఆమెను వర్సిటీ సీఈవో నీలిమ, డీన్లు, అధ్యాపకులు అభినందించారు.

సరిహద్దుల్లో నిఘా పెంచాలి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరురూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో నిఘా మరింత పెంచాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వివిధ కేసులపై ఎస్ఐ విఠల్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్, ఓగిపూర్, కరన్‌కోట్ ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. ఇసుకరవాణా, అక్రమ మద్యం, మత్తుపదార్థాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుకు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుపై దృష్టిపెట్టాలన్నారు. రాత్రివేళ పోలీసు గస్తీ పెంచాలని ఆదేశించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఏసీడీపీవో రేణుకకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తాండూరురూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): మే20న కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏసీడీపీవో రేణుకకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 11 జాతీయ కార్మిక సంఘాలు మే 20న సారస్వతిక సమ్మెను తలపెట్టాయన్నారు. కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, మేనెల మొత్తం సెలవులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తాండూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి బేబీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో కేటీఆర్‌కు స్వాగతం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘట్‌కేసర్‌లో బుధవారం పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కేటీఆర్ వరంగల్ వెళ్తున్న విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఘట్‌కేసర్‌లోని బైపాస్‌చౌరస్తా చేరుకోగా కేటీఆర్ కొద్దిసేపు ఆగి నాయకులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, కొండల్‌రెడ్డి, షకీల్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో
పాలసీ విధానం-సవాళ్లు పుస్తకావిష్కరణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ రచించిన భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో పాలసీ విధానం-సవాళ్లు అనే పుస్తకాన్ని బుధవారం కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక ఆవిష్కరించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అంశాన్ని డా.రమేష్ అందరికీ అర్థమయ్యే రీతిలో పరిశోధనాత్మకంగా రచించారంటూ కొనియాడారు. అంతేగాక అనేక పాఠ్యాంశాలను ఓపెన్ ఇంటర్‌కు, ఎంఏ ఎకనామిక్స్, డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డారని ఆమె గుర్తుచేశారు. పుస్తక రచనపట్ల ఆయనకు మంచి మక్కువ ఉందని.. ముున్ముందు మరిన్ని రచనలు చేయాలంటూ సలహా చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సేరేష్, డా.చింతల రాకేష్ భవాని, డీ.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ, నరేందర్‌రెడ్డి, డా.మాధవి, రవికుమార్, డా.డి.వి.రావుపాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాధిక తదితరులు



ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

చౌడాపూర్,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవోలు రాంచందర్, హబీబ్ అహ్మద్, హెచ్‌ఎం మల్లికార్జున్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా చేపట్టాలి

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్, తాండూరు మున్సిపల్ ప్రత్యేకాధికారి సుధీర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్లారెస్‌కు 7 రోజులే గడువున్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు రోజూ వార్డుల్లో తిరిగి సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, స్ట్రీట్‌లైట్లకు సంబంధించిన ఫిర్యాదుల రిజిష్టర్‌ను మెయిన్‌టెయిన్ చేయాలని ఆదేశించారు. ట్యాంకులు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సింహారెడ్డి, డీఈఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఏఈ ఖాజా హుస్సేన్ ఉన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పొట్లి మహరాజ్, సీతారాంపేట్ హనుమాన్ ఆలయాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పొట్లి మహరాజ్ ఆలయ ఆవరణలో నిర్వహించారు. భద్రేశ్వరాలయంలో నిత్యాన్నదానానికి దాసోహం భవనాన్ని నిర్మించడం ఈ పాలకవర్గంతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్‌లు ప్రసాద్‌గౌడ్, భీమలింగం, దేవాదాయ అధికారులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, కాళికాదేవి ఆలయ చైర్మన్ పి.బస్వరాజ్, డాక్టర్ సంపత్‌కుమార్, వెంకట్‌రాములుగౌడ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారిద్దాం

బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై దృష్టిసారిస్తూ పరిష్కారానికి కార్యాచరణతో ముందుకెళ్దామని ఎంపీడీవో విజయ్ కుమార్ కార్యదర్శులకు సూచించారు. బుధవారం కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రాజీవ్ యువ వికాసం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఇతర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఎక్కడైనా బోర్లు పనిచేయకుంటే బాగు చేయించాలన్నారు. అడవి పందులతో పొలాలు నాశనం అవుతున్నాయనే అంశంపై రేంజర్ శ్రీదేవిసరస్వతి మాట్లాడారు. పంటల రక్షణకు అడవి పందులను తరిమేసేలా చట్టం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.వెంకటేశ్, ఏవో అనిత, ఎంపీవో జయకర్, ఉపాధి ఈసీ నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం

రాష్ట్ర కమిటీ సభ్యులుగా గిరి, ప్రభు



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌కు చెందిన నర్రా గిరి, అన్నెపు ప్రభులు భవన నిర్మాణ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. శంషాబాద్‌లో రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మహాసభల్లో ప్రతినిధులు వారిని ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. గిరి, ప్రభులను బుధవారం పూల మాలలతో సన్మానించారు. ఏఐటీయూసీకి చెందిన వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీ

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో తూనికల కొలతల శాఖ అధికారులు బుధవారం ఒక్కరోజు శిబిరం నిర్వహించారు. మొత్తం 53యంత్రాలను జిల్లా అధికారి రియాజ్ హైమాద్ ఖాన్, సిబ్బంది పరిశీలించి సీలింగ్, చెకింగ్, స్టాపింగ్ చేసి సర్టిపై చేశారు. స్వర్ణకారులు యేటా యంత్రాలను సీలింగ్, చెకింగ్ చేయించుకోవాలని చెప్పారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

25న రెండు ద్విచక్ర వాహనాల వేలం

తాండూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నేరాల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న ఉదయం 11గంటలకు వేలం వేస్తామని ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ బుధవారం తెలిపారు.

అట్టహాసంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం




కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకొని మంగళవారం రాత్రి అట్టహాసంగా పద్మావతి శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి సరిత దంపతులు స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరుడు, గరుత్మంతుడి భారీ ప్రతిమలను ఏర్పాటు చేసి, కల్యాణ వేదికను పూలు, పండ్లు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులతో పాటు వేదపండితులు స్వామి కల్యాణోత్సవ విశిష్టతను వివరించారు. కల్యాణోత్సవం చివర ముత్యాల తలంబ్రాలను పోసి, వచ్చిన భక్తులకు పంచారు. కల్యాణోత్సవానికి హాజరైన వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డితో పాటు పార్టీలకతీతంగా హాజరై పట్టణ ప్రముఖులు వేదపండితుల ఆశీర్వాదం పొందారు.

నిధుల్లేవు.. పనులు కావు

- కునారిల్లుతున్న పంచాయతీలు
- గ్రామీణులకు కొరవడిన వసతులు
- పూర్తి స్థాయిలో అమలుకాని చట్టం



నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

తాండూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. అయితే 73 రాజ్యాంగ సవరణ చట్టం, 2018 పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. ప్రభుత్వాలు బదలాయించాల్సిన అధికారులను ఇవ్వడం లేదు. నిధుల్లేక, పనులు జరగక పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఏటా ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటుటున్నారు తప్పితే వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడం లేదు. స్థానిక సంస్థలకు సరిపడా నిధులివ్వడం లేదు. గ్రామ పంచాయతీ, మండల/జిల్లా పరిషత్‌లు నిధులు లేక కునారిల్లుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీలు ఉత్సవ విగ్రహాల్లో మారుతున్నారు. ఐదేళ్లకోసారి సక్రమంగా ఎన్నికలు నిర్వహించక కేంద్ర ఆర్థిక సంఘం నిధులూ రావడం లేదు. దీంతో గ్రామీణులకు సదుపాయాలు, రోడ్లు, వీధి దీపాలు, విద్య, ఉపాధి వంటి సదుపాయలు మృగ్యమవుతున్నాయి.

స్థానిక సంస్థలు నిర్వీర్యం

స్థానిక సంస్థలకు సాధికారిత కల్పించి 20ఏళ్లు గడిచింది. అయినా ప్రభుత్వాలు వాటిని 29 అధికారాలను బదలాయించలేదు. ప్రజా పంపిణీ, సాంఘిక సంక్షేమం, మార్కెట్-ప్రదర్శనలు, లైబ్రరీలు, సాంకేతికశిక్షణ, వృత్తివిద్య, పేదరిక నిర్మూలన, విద్యుదీకరణ, గృహనిర్మాణం, విద్య, పారిశుధ్యం, చిన్నతరహా పరిశ్రమలు, అడవులు, భూ అభివృద్ధి, పశుపోషణ, పాల ఉత్పత్తి, సామాజిక ఆస్తుల పరిరక్షణ తదితర 29అంశాల్లో నేటికీ పంచాయతీలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లో సాగుతుండడంతో ప్రజల అభివృద్ధిపై గ్రామ పంచాయతీలు, మండల/జిల్లా పరిషత్‌లు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయి. నిజానికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో పంచాయతీరాజ్ వ్యవస్థే కీలకం. 1993 నుంచి ఏటా ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1994లో రాజ్యాంగ సవరణతో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించారు. అయితే రాష్ట్రంలో చాలా రోజులుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించక ప్రజాప్రతినిధుల్లేరు. గ్రామీణుల బాగోగులు చూసే బాధ్యత అధికారులపై ఉన్నా వారు పూర్తిస్థాయి సేవలందించడం లేదు.

నీటి సమస్య తలెత్తకుండా

చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. హాజరైన జిల్లా ఎఫ్‌ఎస్‌వో ఎస్‌కే.ఫరీద్ మాట్లాడుతూ.. అడవి పందుల వల్ల పంటనష్టం జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై సూచనలు చేశారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి మాట్లాడుతూ.., భూ సమస్యలుంటే జూన్ 2కల్లా రైతుల పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. సమావేశంలో ఏవో జయశంకర్, ఎంఈవో యాదగిరి, కార్యదర్శులు నర్సిములు, సుగుణ, స్వప్న, రాణి, మాధవి, ప్రవీణ్‌కుమార్, జగన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



యంత్రానికి పూజచేసి ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఆదర్శమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే యంత్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూజచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల నూతన మున్సిపాలిటీ మున్సిపాలిటీ పరిధిలోని 12 గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి, పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ పూర్ణచందర్, ఎస్సీసీటీ మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, వసంతం, మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్, గంగి యాదయ్య, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం టు కాశీ.. పాదయాత్ర

- షాద్‌నగర్‌లో స్వాములకు ఘన స్వాగతం



యాత్రికులకు స్వాగతం పలుకుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ రామేశ్వరం పుణ్యక్షేత్రం నుంచి కాశీకి పాదయాత్రగా వెళ్తున్న స్వాములకు ఘనస్వాగతం లభించింది. మార్చి 3న రామేశ్వరంలో ప్రారంభమైన 24 మంది భక్తుల పాదయాత్ర బుధవారం రాత్రి షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంది. ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికి, విడిది ఏర్పాటు చేశారు. 1983 నుంచి ప్రతీ ఏడు సంవత్సరాలకోసారి రామేశ్వరం నుంచి కాశీకి పాదయాత్ర వెళ్తున్నామని, ఇది ఏడవ యాత్ర అని పాదయాత్రకు నాయకత్వం వహిస్తున్న సోమసుందరం తెలిపారు. ప్రతీరోజు 24 కిలోమీటర్ల చొప్పున 2,500 కిలోమీటర్ల పాదయాత్ర జూన్ 28న ముగుస్తుందని తెలిపారు. భారతీయ జాతీయ భావాన్ని ప్రజలకు వివరిస్తూ, దాతల సహకారంతో పాదయాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో పట్టణ ప్రముఖులు బి.జగన్‌మోహన్‌రెడ్డి, పరిగి సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, గందం ఆనంద్, కానుగు రాంభూపాల్, కోట జనార్దన్, రమేష్ తదితరులున్నారు.రి

బీఆర్‌ఎస్‌లో చేరికలు

వికారాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధి 9వ వార్డు బూర్గుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనంత్‌రెడ్డి బుధవారం తన వర్గంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మెతుకుఆనంద్ తన నివాసంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గోపాల్, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ శేఖర్, విజయ్‌కుమార్, గంగారం వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆనంద్



బస్సు కోసం ఎండలో నిరీక్షణ

బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు బస్సుల కోసం రోడ్లపై ఎండలో నిరీక్షిస్తున్నారు. నిత్యం ఇక్కడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. ప్రయాణికులకు నిలువ నీడలేదు. ఎండ, వానల్లోనే నిల్చుంటున్నారు. లేదా సమీప ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ప్రతీ గ్రామంలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంచినీళ్లు మహాప్రభో!

20 రోజులుగా అందని భగీరథ నీరు

లాల్‌గడి మలక్ పేటలో మహిళల ఆందోళన

ఇరవై రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలోని మాలవాడలో 20 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని, పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. దీంతో బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లాల్‌గడిలోని మాల కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్ లైన్లను మరమ్మతు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - శామీర్‌పేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)

నిరసనల వెల్లువ

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి క్షమించరాని నేరమని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. దాడికి పాల్పడిన వారిని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. - షాద్‌నగర్, ఏప్రిల్ 23

ఉగ్రదాడి క్షమించరాని నేరం



జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ మైదాన ప్రాంతంలో మంగళవారం పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రదాడి క్షమించరాని నేరం. అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలి. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం క్షమించరాని నేరం. మరణించిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా.

-వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే

ఇది పిరికిపంద చర్య



పహల్గాంలో అమాయక ప్రజలపై దాడి పిరికిపంద చర్య. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశ భద్రత, సమగ్రతను దెబ్బతీసేందుకే ఈ దాడుల వెనుక ఉన్న లక్ష్యం. భారత్ కూడా ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలి. ప్రజలందరూ సమైక్యతతో ఉంటూ ఇలాంటి దాడులను .తిప్పికొట్టాలి.

-నవీన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఉగ్రవాదులను అణచివేయాలి



ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. ఉగ్రదాడిలో మరణించిన వారికి ఘన నివాళి అర్పిస్తున్నాం. 28 మంది మరణించడం బాధాకరమైన విషాద సంఘటన. ప్రశాంత వాతావరణంలో ఉన్న దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడానికి పాల్పడితే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరు. తగిన బుద్ధి చెబుతారు.

-అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే

హిందూ, ముస్లింల మధ్య చిచ్చు



దేశంలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి మారణహోమం సృషించేందుకు చేసిన కుట్రలో భాగంగానే ఉగ్రదాడి జరిగింది. భారత్‌ను అస్థిర పర్చేందుకు పాకిస్థాన్ మిలటరీ కుట్ర చేస్తోంది. దేశంలో అల్లర్లు సృష్టించేందుకే యాత్రికులను ఏ మతం అని అడిగి చంపడం దారుణం.

-పి.విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

మారణహోమం.. అత్యంత దారుణం



కశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయం. కేవలం హిందువులను టార్గెట్ చేసుకొని హతమార్చడం అత్యంత బాధాకరం. ముస్లిం ఉగ్రవాద సంస్థలు మన దేశంలోనే మనకు రక్షణ లేకుండా చేస్తున్నాయి. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి.

-బందారు రమేష్, వీహెచ్‌పీ క్షేత్ర ప్రముఖ్

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి చంపడం దారుణం. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేయాలి. హిందువులనే టార్గెట్ చేసి చంపడం అత్యంత బాధాకరం. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఉక్కుపాదంతో అణచివేయాలి. ప్రజలు ఐక్యంగా ఉంటూ ఉగ్రవాదంపై పోరాడాలి.

-పల్లె నర్సింగ్ రావు, మాజీ జెడ్పీటీసీ, కేశంపేట


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

ఆమనగల్లు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2కోట్ల 35 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి రోగులకు అన్నీ రకాల వైద్య సేవలు అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం కేశవులు, సురేందర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, కృష్ణ, బాబా, విజయ్ రాథోడ్, హనుమాన్‌నాయక్, యాదగిరిరెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమా?

(5వ పేజీ తరువాయి)

ట్రాఫిక్‌జాం అవుతోంది. రోడ్డు మధ్య నుంచి ఇటు 50 ఫీట్లు, అటు 50 ఫీట్ల వరకు జాతీయ రహదారి అధికారుల ఆధీనంలో ఉండాల్సింది. అయితే రెండు వైపులా కలిసి మండల కేంద్రంలో 60 ఫీట్లు మాత్రమే ఉంది. మిగిలిన రోడ్డును వ్యాపారస్తులు ఆక్రమిస్తున్నారు. వాహనదారులు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కందుకూరులో బస్‌స్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. అలాగే మరుగుదొడ్లు, జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేక స్థానికులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు గుర్తించి బస్‌స్టాండ్, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి.

- కె.వెంకటేశ్వర్లుగుప్త, వ్యాపారి, కందుకూరు



పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

ఇప్పటికైనా జాతీయ రహదారిని సంపూర్ణంగా నిర్మించి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సెలవులు వచ్చాయంటే చాలు వాహనాల రద్దీ పెరిగిపోతుంది. బస్‌స్టాండ్ లేకపోవడంతో బస్సును రోడ్డుపైనే నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సంబంధిత అధికారులు కనీసం బస్సులు నిలిపేందుకు స్థలాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కందుకూరువైపు ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటుచేసి, సిబ్బందిని నియమించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతుతున్నారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

ఆదిభట్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ మాసాబ్ చెరువు సమీపంలో వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం మేరకు.. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన వ్యక్తి తుర్కయాంజాల్ మాసాబ్ చెరువు కట్టపైన బుద్ధుని విగ్రహం దగ్గర రోడ్డు దాటుతుండగా బీఎన్‌రెడ్డి నగర్ వైపు నుంచి తుర్కయంజాల్ వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఆ వ్యక్తిని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఉస్మానియాకు తరలించారు. సమాచారం తెలిస్తే ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ నంబర్లు 8712662671, 87126 62364, 8712662382కు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. ముగ్గురిపై కేసు

● తాటిముంజల విషయంలో దాయాదుల గొడవ

మాడ్గుల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) తాటి ముంజల విషయంలో గొడవపడి ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని ఇర్విన్ గ్రామంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. ఇర్విన్‌కు చెందిన గోరెటి యాదయ్య, కుమారుడు కిరణ్ బుధవారం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈక్రమంలో తాటిముంజలు కొని విక్రయించేవారు వేరే గ్రామం నుంచి వీరి వద్దకు చేరుకున్నారు. అయితే, తమ పొలంలోని తాటిచెట్టుకు ముంజలున్నాయని గోరటి యాదయ్య వారికి చెప్పడంతో.. చెట్టు ఎక్కి కోశారు. అయితే, వారి భూమికి ఆనుకొని ఉన్న గోరెటి వంశీ మిమ్మల్ని తాటి ముంజలను కోయమని చెప్పింది ఎవరని ప్రశ్నించారు. అయితే, యాదయ్య, వంశీ భూముల మధ్య తాటిచెట్టు ఉండటంతో వారి మధ్య కాస్త గొడవ జరిగింది. ఈక్రమంలో గోరటి యాదయ్యపై గోరెటి వంశీ కల్లు గీచే కత్తితో దాడిచేశాడు. దాంతో అతడికి రక్త గాయాలయ్యాయని సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. అక్కడే ఉన్న గోరటి యాదయ్య కుమారుడు కిరణ్ గొడవను ఆపటానికి వెళ్లగా.. దాడిచేసి గాయపరిచారని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడిచేసిన గోరటి శంశీ, గోరటి జంగయ్య, గోరటి యాదగిరిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

కాపర్ వైరు చోరీ

కందుకూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగూడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలలో ఉన్న బోర్ల వద్ద దొంగలు కాపర్ వైర్లను చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈమేరకు బాధితులు బుధవారం ఉదయం కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం వారు మాట్లాడారు. కొత్తగూడకు చెందిన బొక్క దామోదర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న బోరుమోటర్ వద్ద సుమారు 30ఫీట్ల కాపర్ వైర్‌ను దొంగలు కట్‌చేసి ఎత్తుకెళ్లారు. ఇప్పటివరకు 2సార్లు దొంగలు వైర్‌ను దొంగించినట్లు బాధితులు వాపోయారు. దామోదర్ రెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధార్‌లా 'భూధార్'!

(5వ పేజీ తరువాయి)

శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

భూధార్ కార్డు జారీ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం ఇంకా తుది గడువు విధించలేదు. అయితే ఈ ప్రక్రియ ఎలా నిర్వహించాలనేదానిపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్ కార్డుతోపాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కు అనుసంధానించిన మొబైల్ నంబరు తప్పనిసరిగా ఉండాలి. వీటి ఆధారంగా వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఇందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఆయా గ్రామాల్లో భూములున్న రైతుల వివరాలను సేకరిస్తారు. తర్వాత ఈ రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను మండల విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులు కలిసి సంయుక్తంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాలు నమోదు కాగానే సదరు రైతుకు సంబంధించిన ఫోన్ నంబర్‌కు ప్రత్యేక గుర్తింపు నంబరు వస్తుంది.

వ్యవసాయ పథకాల అమలులో..

భూఆక్రమణలు, అక్రమ కట్టడాల నిర్మాణాలపై ఎప్పటికపుడు నిఘా ఉంటుంది. అలాగే భూధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యను బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతో అనుసంధానం చేయనున్నారు. దీంతో రుణాలు ఇతర పథకాల అమలు మరింత సులభతరమవుతుంది. భవిష్యత్తులో రైతులకు అమలు చేసే వివిధ పథకాలతోపాటు ఎరువులు, ఇతర సబ్సిడీలకు భూధార్ ఆధారమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే, ప్రస్తుతానికి మాత్రం కేంద్ర ప్రభుత్వ పథకాలకు మాత్రమే దీన్ని వినియోగించనున్నట్లు సమాచారం. ఇక రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలను భూధార్‌తో సంబంధం లేకుండానే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ కా'లేజీ'లు!

(5వ పేజీ తరువాయి)

పోలిస్తే ప్రతీ ఏడాది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగుతున్నా దాన్ని అధికమించడానికి అధ్యాపకులు పెద్దగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇంటర్ ఫలితాలను చూసిన పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇకపోతే ఏటేటా జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య క్రమంగా తగ్గుతున్నా.. సర్కారు ఏమాంతగా సీరియస్‌గా తీసుకోవడం లేదని పలువురు విద్యా నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇకపోతే ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ కళాశాలలు జిల్లాలో లేకపోవడం గమనార్హం.

ఫలితాలు అంతంతే..

ఇంటర్ ఫలితాల్లో సర్కారు కళాశాలలు డీలాపడ్డాయి. అన్ని కళాశాలల్లోనూ సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ మంచి ఫలితాలు మాత్రం రావడం లేదు. ప్రతి కళాశాలలో నిపుణులైన అధ్యాపకులున్నా విద్యార్థులు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సంలో ఫెయిల్ కావడం ఆందోళన కలిగిస్తున్నది. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో సీట్ దొరకడం గగనమయ్యేది. ప్రస్తుతం సీట్ల భర్తీకి విద్యార్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో చదివి మెడిసిన్, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత కోర్సుల్లో సీట్లు సాధించిన వారూ ఉన్నారు. నేడు ఇంటర్ పాస్ కావడమే పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వ కళాశాలను ఆశ్రయించేది బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులే అధికంగా ఉంటారు. ఇలాంటి తరుణంలో అధ్యాపకులు విద్యార్థులపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

జిల్లాల్లో 17 కళాశాలలు

రంగారెడ్డి జిల్లాల్లో 17 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో వెలువడిన ఇంటర్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం ఫలితాల్లో జిల్లాల్లో ఒక్క కళాశాల కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించలేకపోయింది. కనీసం 50 శాతానికి మించి ఫలితాలు సాధించిన కళాశాలలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల 17 శాతం, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల 18.9 శాతం, ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల 18.4 శాతం, షాద్‌నగర్ జూనియర్ కళాశాల 49.79, చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల 22 శాతం మాత్రమే ఫలితాలు సాధించాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాత్రం కాస్త మెరుగైన ఫలితాలు సాధించాయి. మంచాల జూనియర్ కళాశాల 90 శాతం ఉత్తీర్ణత, షాద్‌నగర్ జూనియర్ కళాశాల 71.6 శాతం, కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 70 శాతం ఉత్తీర్ణత సాధించాయి.


చౌదరిగూడ : చేగిరెడ్డి ఘణాపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘణాపూర్‌లో నూతనంగా నిర్మించిన కోట మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ శివ, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకట్ నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్, యాదయ్య, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో ఎండలతో జాగ్రత్త


నేదునూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేసిన ఉపాధ్యాయులు

కందుకూరు ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులను ఎండల్లో తిరగనివ్వరాదని నేదునూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస శర్మ, అన్నారు. బుధవారం ఆ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన విద్యార్థులకు టీచర్లతో కలిసి ప్రగతి పత్రాలను అందజేశారు. అంతకుముందు గణిత ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశం బదిలీపై వెళతుండటంతో సన్మానించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

చేవెళ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ కళాశాలల్లోనే లభిస్తుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాలలో ప్రవేశాలు పొందాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల కలలను సాకారం చేసే కేంద్రంగా, సమగ్రాభివృద్ధికి మార్గదర్శిగా చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సొంత భవనంతోపాటు అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు- 8328176599 నెంబర్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మేడేను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో కార్మికులతో కలిసి మేడేకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ మేడే కార్మికులకు పండుగలాంటిదని అన్నారు. రోజుకు ఎనిమిది గంటలు పని చేస్తున్నా కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు సంతాపం

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా బుధవారం జిల్లావ్యాప్తంగా పార్టీలకతీతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.


కొత్తూర్ : కొవ్వొత్తుల ర్యాలీలో నాయకులు



ఆమనగల్లు : నిరసన ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు


చేవెళ్ల పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


చౌదరిగూడ : కొవ్వొత్తుల ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు


కొందుర్గులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రజతోత్సవ సభకు ఉప్పెనలా కదలాలి

కడ్తాల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఉప్పెనలా కదిలిరావాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. సభ సన్నాహకంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా సభకు సంబంధించి గోడరాత లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నాయత్వంలో రాస్తున్నట్లు తెలిపారు.

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

మొయినాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నేడు(గురువారం) మొయినాబాద్‌లో భూభారతి చట్టం-2025పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

చౌదరిగూడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తూంపల్లిలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎల్కగూడలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌లు ఇంటింటికీ తిరిగారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణకోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల నుంచి వివరాలను.. ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన లిస్టు మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గెజిటెడ్ అధికారులను ఆయా గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి సర్వే నిర్వహిస్తోంది.

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాటం ఉధృతం

తలకొండపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు అన్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 179వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గ్రామంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

అకాల వర్షం.. మామిడి రైతులకు నష్టం

కడ్తాల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం, ఈదురు గాలులకు మండలంలో పలువురు రైతుల మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు కొందరు రైతులకు చెందిన మామిడి తోటల్లో పెద్దఎత్తున కాయలు రాలిపోయాయి. ఈసారి మామిడి కాపు అంతంత మాత్రంగానే వచ్చింది. దీనికితోడు ఈదురు గాలులు, అకాల వర్షంతో పూర్తిగా నష్టపోయామని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వర్షానికి పలుచోట్ల అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపక్కన హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి.

సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రబియాసుల్తానాకు గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రేషన్ సరుకులు పక్క గ్రామమైన నాగర్‌కుంటలో ఇస్తున్నందున.. కిలోమీటర్ ప్రయాణించడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలోనే ఇచ్చేలా చూడాలన్నారు. సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. భాస్కర్, విజయ్, నర్సింహులు, శ్రీనివాస్, మారుతి, బాల్‌రాజ్, తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చౌదరిగూడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను తహసీల్దార్ రమేష్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

షాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. షాబాద్‌లోని మాంటిస్సోరీ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ మహేష్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రమేష్, తదితరులున్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు : ఆర్డీవో

చేవెళ్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో మెరిట్ మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు పదిమందిని విగ్నేష్ గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఆర్డీవో, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈవో పురందాస్, సీఐ భూపాల్‌శ్రీధర్ తదితరుల చేతులు మీదుగా ఘనంగా సన్మానించి ప్రైజ్‌మనీ అందజేశారు. విద్యార్థులను సన్మానించేందుకు ముందుకు వచ్చిన దాత విగ్నేష్‌గౌడ్‌ను అధికారులు అభినందించారు.

కందుకూరు : మండలంలోని నేదునూరు ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో స్టేట్ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. బుధవారం కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఆ కళాశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు తదితరులున్నారు.

మంచాల : విద్యార్థులు తమకంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని మంచాల పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్‌యాదవ్ సూచించారు. ఇంటర్ ఫస్టియర్‌లో చెన్నారెడ్డిగూడకు చెందిన బి.శైలజ(488/500) ఆర్.శిరీష(462/500), పి.స్పందన(447/500)లు ప్రతిభ కనబర్చారు. వీరంతా వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని నాగార్జున కళాశాలలో చదువుతున్నారు. విద్యార్థుల ప్రతిభ పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. శాలువాతో సత్కరించి అభినందించారు. భాస్కర్, వెంకటేష్, రాములు, కిషన్, శ్రీను, పరమేష్, లక్ష్మన్, స్వామి, గోపాల్, వెంకటేష్, భాస్కర్, రఘు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

మొయినాబాద్ : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న ఎన్టీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో వరుసగా ముగ్గురు విద్యార్థులు షేక్ అస్రతబసుం, తిరునగరి వర్ష, గుడుపల్లి బ్లెస్సీ 993 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 4వ స్థానంలో నిలిచారు. వీరందరిని ఎన్టీఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి అభినందించారు. సీఈవో రాజేంద్రప్రసాద్, డీన్ ఎంవీ రామారావు, డైరెక్టర్ వెంకటేశ్వర్లు సైతం ఈ సందర్భంగా వారిని అభినందించారు.


చేవెళ్ల : ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానిస్తున్న ఆర్డీవో చంద్రకళ తదితరులు